క్లుప్తంగా

ఘనంగా నరసింహుని జయంతి



తాడేపల్లి రూరల్: పోలకంపాడులోని జై సింహాద్రి అప్పన్న దేవస్థానం వార్షికోత్సవ వేడుకలను వైభవంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా ఆదివారం నరసింహస్వామి జయంతిని ఘనంగా జరిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వైఎస్సార్‌సీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి పాల్గొన్నారు. కమిటీ సభ్యులతో కలిసి ఆయన ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రాత్రి మేళతాళాలు, కోలాటాలు, డప్పుచప్పుల్ల మధ్య స్వామి వారి ఊరేగింపు కనులపండువగా సాగింది.

అంగన్‌వాడీ కేంద్రంలో మాతృదినోత్సవం

ఫిరంగిపురం: మండలంలోని నుదురుపాడు అంగన్‌వాడీ కేంద్రంలో అంతర్జాతీయ మాతృదినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. చిన్నారులు తమ తల్లులకు గంధం, పూలు, పండ్లు అందజేసి వారి ఆశీసులు తీసుకున్నారు. మాతృదినోత్సవం గురించి అంగన్‌వాడీ టీచర్ సునీత వివరించారు. కార్యక్రమంలో చిన్నారులు, వారి తల్లులు పాల్గొన్నారు.

ప్రార్థనా మందిరంలో మదర్స్ డే



దుగ్గిరాల: ప్రతి ఒక్కరి జీవితంలో అమ్మ ప్రేమతో పాటు అమ్మ చేసే త్యాగాలు ఉంటాయని ఫాదర్ సురేష్ అన్నారు. దుగ్గిరాల మండలం చిలువూరు గ్రామంలో ఆదివారం ఆర్‌సీయం చర్చిలో మదర్స్ డే వేడుకలను నిర్వహించారు. ఫాదర్ మాట్లాడుతూ.. అమ్మ ప్రేమ స్వార్థం లేకుండా ఉంటుందని.. అమ్మకు సాటి ఎవరూ లేరని అన్నారు. మాతృమూర్తులందరికీ ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ప్రార్థనలలో పాల్గొన్న మహిళలు కేకు కట్ చేసి పంచుకున్నారు.

ఆధార్ కేంద్రం మూసివేతతో ఇక్కట్లు



తెనాలిఅర్బన్: మున్సిపల్ కార్యాలయంలోని మెప్మా షెడ్డు వద్ద ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రం గత ఏడాది చివరి నుంచి పనిచేయడం లేదు. తెనాలి, పరిసర గ్రామీణ ప్రాంత ప్రజలు ఆధార్‌లోని మార్పులు, చేర్పులు వంటి వాటి కోసం ఇక్కడకు వచ్చి వాటి సేవలు పొందేవారు. గడువు ముగియడంతో ఆధార్ కేంద్రం మూసివేసినట్లు తెలిసింది. ఆధార్ కేంద్రం మూసివేతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఆధార్ కేంద్రం తెరిచే విధంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగిస్తే సహించం

చిరు వ్యాపారులకు రూరల్ ఎస్‌ఐ హెచ్చరిక



తెనాలిరూరల్: ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగిస్తే సహించేది లేదని రూరల్ ఎస్‌ఐ కె.ఆనంద్ చిరు వ్యాపారులను హెచ్చరించారు. మండలంలోని నందివెలుగు గ్రామంలో తెనాలి – విజయవాడ రహదారిపై ఉన్న ప్రధాన కూడలి, కూడలి నుంచి అత్తోట వైపు, కొలకలూరు వైపున్న వంతెనల ఫుట్‌పాత్‌లు చిరు వ్యాపారాలకు నిలయాలుగా మారాయి. దీని వలన ఇక్కడ ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. ఇది గమనించిన ఎస్‌ఐ ఆదివారం సాయంత్రం అక్కడి వ్యాపారులతో మాట్లాడారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతుండడంతో పాటు ప్రమాదాలు జరుగుతున్నందున సోమవారం సాయంత్రంలోగా వ్యాపారాలను తీసి వేయాలని సూచించారు. ట్రాఫిక్ నియంత్రణకు సహకరించాలని కోరారు.

భవన నిర్మాణ కార్మికులకు ఏదీ ఆసరా!

- సంక్షేమ పథకంపై అవగాహన కల్పించడంలో అధికారుల విఫలం
- సభ్యత్వ నమోదులోనూ వెనుకబాటు
- కార్మికుల ప్రమాదాలపై ఏదో విధంగా తప్పించుకుంటున్న యజమానులు



ప్రమాద అంచుల్లో పనిచేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

తాడేపల్లి రూరల్: భవన నిర్మాణ కార్మికుల భద్రత, సంక్షేమం కోసం ప్రభుత్వం 1998లో భవన నిర్మాణ కార్మిక సంక్షేమ పథకాన్ని ప్రవేశపెట్టింది. ప్రారంభంలో ఈ పథకం కేవలం భవన నిర్మాణ కార్మికులకు మాత్రమే ఉపయోగపడేది. అనంతరం అనేక రకాల పనులు చేసే కార్మికులు ఈ పథకంలో చేరడానికి అర్హులుగా ప్రభుత్వం ప్రకటించింది. ప్రస్తుతం భవన నిర్మాణ కార్మికులతో పాటు గ్రానైట్ కార్మికులు, ఉపాధి కూలీలు, టైలర్లు, ఎలక్ట్రీషియన్లు, కార్పెంటర్లు, మెకానిక్ పనులు చేసే కార్మికులు ఈ పథకంలో సభ్యత్వం తీసుకునేందుకు అర్హులు. కానీ మంగళగిరి నియోజకవర్గంలో భవన నిర్మాణ కార్మిక సంక్షేమ పథకంపై కార్మికులకు అవగాహన కల్పించడంలో అధికారులు విఫమవుతున్నారు.

మంగళగిరి నియోజకవర్గంలో..

నియోజకవర్గంలోని మంగళగిరి, తాడేపల్లి పట్టణ, రూరల్ ప్రాంతాలు, దుగ్గిరాల మండలాల్లో వేలాది మంది కార్మికులు భవన నిర్మాణ రంగంలో, కార్పెంటర్లు, టైలర్లు, ఉపాధి కూలీలు, ఎలక్ట్రీషియన్లుగా అత్యధిక సంఖ్యలో కార్మికులు పనిచేస్తున్నారు. వీరికి అధికారులు అవగాహన కల్పించి సభ్యత్వం ఇప్పించాల్సిన బాధ్యత ఉంది. కానీ అధికారులు కార్మికులకు అవగాహన కల్పించడం మాత్రం అంతంతగానే ఉంది. దీంతో అర్హులైన చాలా మంది కార్మికులు ప్రమాదాల బారిన పడి కుటుంబాలను నష్టపోతున్నప్పటికీ ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం పొందలేకపోతున్నారు. ఫలితంగా కార్మిక కుటుంబానికి ఎంతో కొంత ముట్టజెప్పి యజమానులు చేతులు దులుపుకొంటున్నారు.

సభ్యత్వ నమోదు ఇలా..

చేతి వృత్తుల కార్మికులు 18 నుంచి 60 ఏళ్ల మధ్య ఉండాలి. దరఖాస్తు కార్మికుడు రెండు ఫొటోలు, ఆధార్, రేషన్ కార్డు, బ్యాంకు అకౌంట్ పాస్ పుస్తకం జిరాక్స్ కాపీలతో పాటు కార్మికుడిపై ఆధారపడి జీవించే వారి ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలు అందజేయాలి. రూ.120 చెల్లించి కార్మిక శాఖ కార్యాలయంలో సభ్యత్వం పొందవచ్చు. ఒక్కసారి సభ్యత్వం తీసుకున్న వారి లేబర్ కార్డు పరిమితి 5 ఏళ్ల వరకూ ఉంటుంది. ఆ తరువాత సభ్యత్వాన్ని రెన్యువల్ చేసుకోవాలి.

ప్రయోజనాలు..

కార్మికుడు పనిచేసే చోట ప్రమాదవశాత్తు మరణించినా, శాశ్వత అంగవైకల్యం పొందినా రూ.2 లక్షల ఆర్థిక సాయం వర్తిస్తుంది. 50 శాతం అంగవైకల్యం పొందిన వారికి రూ.1 లక్ష, సాధారణ మరణం పొందితే రూ.30 వేలు ఆర్థికంగా అందిస్తారు. వివాహం తర్వాత కార్మికునికి ఒక్కో కుమార్తెకు కాన్పు సమయంలో రూ.25 వేల చొప్పున రెండు కాన్పులకు ఆర్థిక సహాయం అందుతుంది. స్వల్పమొత్తం చెల్లించి సభ్యత్వం పొందడం ద్వారా 5 ఏళ్ల పాటు కార్మికుడికి, ఆయన కుటుంబానికి భద్రత లభించడంతో పాటు సంక్షేమ పథకాలను కూడా పొందే సౌలభ్యం ఉంది.

పథకం గురించి చాలా మందికి తెలీదు..



తాడేపల్లి చుట్టుపక్కల ప్రాంతాల్లో వేలమంది కార్మికులు పని చేస్తున్నారు. పనులు చేసే సమయంలో ఎక్కడో ఒకచోట కార్మికులు గాయపడుతున్నారు. కొంతమంది శరీరంలోని కొన్ని అవయవాలను కోల్పోతున్నారు. మరికొంతమంది చనిపోతున్నారు. అటువంటి వారికి కార్మిక శాఖ నుంచి ఎటువంటి సహాయ సహకారాలు అందుతాయన్న విషయం చాలా మందికి తెలియదు. కార్మిక సంఘ నాయకులు వాటిపై కార్మికులకు అవగాహన కల్పించాలి.

–నాగబాబు, తాపీమేస్త్రి, పోలకంపాడు

కార్మికులకు అవగాహన కల్పించాలి..



అధికారులు భవన నిర్మాణ కార్మికులకు ఎలాంటి పథకాలు వర్తిస్తాయి అనేది తప్పని సరిగా అవగాహన కల్పించాలి. కార్మికులుగా పని చేసేవారు చదువుకోకపోవడంతో వారికి జరిగే నష్టం గురించి తెలియదు. కార్మిక సంఘం ఆధ్వర్యంలో అవగాహన కల్పించడంతో పాటు అధికారులతో కలసి వారికి రావాల్సిన సంక్షేమ పథకాలను అందించే విధంగా అందరం కృషి చేయాలి.

–ఆర్.శ్రీనివాసరాజు, వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ కార్మిక విభాగ నియోజకవర్గ అధ్యక్షులు

కార్మికుల దీక్షకు మద్దతు

తాడేపల్లి రూరల్: ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యను ప్రభుత్వం పరిష్కరించాలని సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు డిమాండ్ చేశారు. ఆదివారం బ్రహ్మనందపురంలో కార్మికులు నిర్వహిస్తున్న రిలే దీక్షా శిబిరాన్ని యూనియన్ నాయకులు బి.సూర్యప్రకాష్‌రావుతో కలసి ప్రారంభించారు. వారికి మద్దతుగా దీక్షలో పాల్గొని మాట్లాడారు. ఎన్నికలకు ముందు మంత్రి నారా లోకేష్ తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే కార్మికుల సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని.. ఇప్పుడు కార్మికుల సమస్యను పరిష్కరించాలని కార్మికులు కోరుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో పిచ్చయ్య, సుబ్బారావు, నవనీతం, అగ్గయ్య, ఆశీర్వాదం, సాంబశివరావు, ఇమాంబి, తుపాకుల నాగేశ్వరరావు, దుర్గాభవాని తదితరులు పాల్గొన్నారు.

కార్మెల్‌మాత సేవలో విశ్వాసులు



ఫిరంగిపురం: మండల కేంద్రంలోని కార్మెల్ కొండపై ఉన్న కార్మెల్‌మాతను పలు ప్రాంతాల విశ్వాసులు ఆదివారం దర్శించుకున్నారు. వేసవి సెలవుల నేపథ్యంలో కర్నూలు, నందిగామ, అద్దంకి, నంద్యాల, వెంకటగిరి ప్రాంతాల వారు కుటుంబ సమేతంగా తరలివచ్చారు. కార్మెల్ కొండను ఎక్కి తలనీలాలు సమర్పించుకున్నారు. మాతను దర్శించుకొని ప్రత్యేక ప్రార్థనలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

రోడ్డుపై నేలకొరిగిన భారీ చెట్టు



రోడ్డుకు అడ్డంగా పడిన భారీ చెట్టు

తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని తాడేపల్లి ప్రధాన రహదారిలో కార్పొరేషన్ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఆదివారం ఓ భారీ చెట్టు నేలకొరిగింది. చెట్టు రోడ్డుకు అడ్డంగా పడడంతో తాడేపల్లి ప్రధాన రహదారిలో రాకపోకలు నిలిచిపోయాయి. కమిషనర్ అలీమ్‌బాషాకు సమాచారం ఇవ్వడంతో స్పందించిన ఆయన కార్పొరేషన్ సిబ్బందిని పంపించి రోడ్డుకు అడ్డంగా ఉన్న చెట్టు కొమ్మలను తొలగించారు. జేసీబీ సహాయంతో ఆ చెట్టును పూర్తిగా పక్కకు నెట్టించివేశారు. ఈదురు గాలులు లేకున్నా భారీ చెట్టు పడిపోవడంతో పలువురు ఆశ్చర్యానికి గురయ్యారు. నిత్యం ఆ రహదారిలో ద్విచక్రవాహనాలు, కార్లు, ఇతర వాహనాలపై రాకపోకలు సాగిస్తుంటారు. చెట్టు పడే సమయంలో ఎవరూ లేకపోవడంతో ఎటువంటి ప్రమాదం జరగలేదు. రోడ్డు పక్కన చెట్టుకు ఎదురుగా పార్కింగ్ చేసిన కారు స్వల్పంగా దెబ్బతింది.

ఏసీసీ కార్మికుల శ్రమ ఫలించనుందా!

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధి బ్రహ్మానందపురంలోని ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షల శ్రమ ఫలించనుంది. కార్మికులు హైకోర్టులో వేసిన ఛాలెంజ్ కేసులు ఇటీవల విచారణకు వచ్చాయి. ఈ సందర్భంగా ఆదివారం పలువురు యూనియన్ నాయకులు మాట్లాడుతూ.. ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ అక్రమ లాకౌట్‌కు గురైన అనంతరం 2003 కలకత్తా డి.ఆర్.టి కోర్టు కంపెనీ ఇండియన్ బ్యాంక్‌కు బకాయి ఉందని.. తాడేపల్లిలో కార్మికులు దీక్షలు కొనసాగిస్తున్న ఫ్యాక్టరీ ఆస్తులను వేలం వేసిందని అన్నారు. వేలంలో రూ.10.92 కోట్లు బాలభాను ఎంటర్‌ప్రైజెస్ పేరు మీద ఎస్.ఆర్.ఐలు వేలంలో ఈ భూములను దక్కించుకున్నారని తెలిపారు. కొన్ని అనివార్య కారణాలతో ఆగిన అప్పటి ఈ కేసు 2025 ఏప్రిల్‌లో హైకోర్టులో డివిజన్ బెంచ్ ఫైనల్ హియరింగ్‌కు వచ్చిందని.. వేసవి సెలవుల అనంతరం కేసును విచారిస్తామని కోర్టు ప్రకటించిందని తెలిపారు. కార్మికుల తరుపున వాదించిన లాయర్లు కార్మికులకు నష్టపరిహారం వస్తుందని ఆశాభావంతో ఉన్నారని తెలిపారు. కాకపోతే నష్ట పరిహారం సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యం చెల్లిస్తుందా లేక భూములు కొనుగోలు చేసిన సంస్థ తరుపున ఎస్.ఆర్.ఐలు చెల్లిస్తారా అనేది వేచిచూడాలి. ఏమైనప్పటికీ 30 ఏళ్ల పోరాటానికి మంచి రోజులు రానున్నాయని యూనియన్ నాయకులు, కార్మికులు అంటున్నారు.

ప్రతి ఇంటికీ కృష్ణా జలాలు అందించడమే లక్ష్యం



భూమిపూజలో నందం అబద్దయ్య

తాడేపల్లి రూరల్: మంగళగిరి నియోజకవర్గంలో ప్రతి ఇంటికీ కృష్ణా జలాలు అందించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర పద్మశాలీ కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య అన్నారు. ఆదివారం ఎంటీఎంసీ పరిధిలోని పెనుమాక టిడ్కో గృహాలకు తాగునీటి సరఫరా నిమిత్తం తాడేపల్లి చైతన్య తపోవన్ సమీపంలో గుంటూరు చానల్ వద్ద తాగునీటి పైప్‌లైన్ పనులకు భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన నందం అబద్దయ్య మాట్లాడుతూ.. ఇటీవల టిడ్కో గృహాలను సందర్శించిన సీఎం చంద్రబాబు ఇంటింటికీ కృష్ణా జలాలను సరఫరా చేస్తాన్న హామీకి ఈ భూమి పూజ నిర్వహించామని తెలిపారు. టీడీపీ గుంటూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, టీటీడీ బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, ఇరిగేషన్ సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా మాతృదినోత్సవం



వేదికపై మాట్లాడుతున్న నటి అనన్య



నృత్యాలు చేస్తున్న మహిళలు

మంగళగిరి: మాతృదినోత్సం సందర్భంగా వీ వైబ్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఎస్‌ఆర్‌ఐ జంక్షన్‌లో 3కే రన్, శారీవాక్, డిజే కార్యక్రమాలు నిర్వహించారు. మంగళగిరి చేనేత పరిశ్రమను ప్రోత్సహించే కార్యక్రమంలో భాగంగా చేనేత చీరలతో మహిళలు ఫ్యాషన్‌షో నిర్వహించారు. నృత్యకారిణి ప్రీతి సంగీత విభావరి(డీజే) కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన నృత్యాలకు మహిళలు ఆనందంతో నృత్యాలు చేస్తూ అలరించారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆద్యంతం అలరించాయి. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన నటి నాగళ్ల అనన్య మహిళలను ఉద్దేశించి మాట్లాడారు. 'డ్రగ్స్ వద్దు.. స్కిల్స్ ముద్దు' అనే వాల్‌పేపర్‌ను నటి సంస్థ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమాన్ని ఐజీ ఏకే రవికృష్ణ ప్రారంభించగా కృష్ణా జిల్లా మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ గద్దె అనురాధ, నిర్వాహకులు రాఘు వీణ తదితరులు పాల్గొన్నారు.

ఎయిమ్స్‌లో వాక్‌థాన్ నేడు

మంగళగిరి: మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని ఆల్ ఇండియా మెడికల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్(ఎయిమ్స్) ఆధ్వర్యంలో వాక్‌థాన్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అంతర్జాతీయ నర్సింగ్ దినోత్సవం సందర్భంగా సోమవారం ఉదయం 6 గంటలకు ఎయిమ్స్ నుంచి ప్రారంభమైయ్యి మంగళగిరి బస్టాండ్ వరకు జరుగుతుందన్నారు.

ఘర్షణలో గాయపడిన భార్యాభర్తలు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని మెల్లెంపూడిలో ఆదివారం జరిగిన ఘర్షణలో భార్యాభర్తలకు గాయాలయ్యాయి. సేకరించిన వివరాల ప్రకారం.. కాటూరి రాము తన గోడ పక్కన ఐరన్ పోల్స్ పాతారు. దీనిపై పక్కనే నివాసం ఉండే యాసిన్ అనే వ్యక్తి అభ్యంతరం తెలిపాడు. 4 రోజుల నుంచి దీనిపై ఇరువురి మధ్య ఘర్షణ జరుగుతోంది. యాసిన్ మధ్యాహ్న సమయంలో తన స్నేహితులైన బాజీ, ఇబ్రహీం, సల్మాన్‌లను వెంట తీసుకొచ్చారు. వీరంతా మద్యం మత్తులో ఉన్నారు. రాము నివాసానికి వచ్చిన సమయంలో మళ్లీ ఘర్షణ మొదలైంది. యాసిన్, అతని వెంట వచ్చిన స్నేహితులు ఈ ఘర్షణను కలుగజేసుకుని విచక్షణా రహితంగా రాము, అతని భార్యపై దాడి చేశారు. దీంతో భార్యాభర్తలిద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. ఘటనపై తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు రాగా పోలీసులు వైద్యం నిమిత్తం భార్యాభర్తలను విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి పంపించారు.

కొనసాగుతున్న వేసవి విజ్ఞాన శిబిరం

తాడికొండ: తుళ్లూరు ప్రాంతీయ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. చిన్నారులకు పేపరుతో బొమ్మల తయారీ, కథలను వివరించడం, ఆట, పాటలు, క్విజ్ వంటి పలు పోటీలను ఏర్పాటు చేసి వారిలోని నైపుణ్యాలను వెలికితీస్తున్నారు. ఆదివారం హైకోర్టు ఉద్యోగి పరమేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని చిన్నారులకు జనరల్ నాలెడ్జ్‌పై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి టి.గిరిధర్ కుమార్ పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

దుగ్గిరాల ఈమని రోడ్డుకు శంకుస్థాపన

దుగ్గిరాల: దుగ్గిరాల ఈమని రోడ్డుకు శంకుస్థాపనను దుగ్గిరాలలో ఆదివారం చేశారు. 4 కిలోమీటర్ల రోడ్డుకి రూ.2.84 కోట్లు అవుతుందని ఎంపీపీ షేక్.జబీన్ తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కె.అనిత, వె.కృష్ణ ప్రసాద్, పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పవిత్ర భగవద్గీత ప్రచారం



దుగ్గిరాల: ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు వారు రచించిన 101 త్రైత సిద్ధాంత ఆధ్యాత్మిక గ్రంథాలు, భగవద్గీత ప్రచారం ఆదివారం నిర్వహించారు. దుగ్గిరాల మండలంలోని ఈమని గ్రామంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక గుంటూరు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ప్రచారం జరిపారు. కమిటీ అధ్యక్షుడు రౌతు శ్రీనివాసరావు మాట్లాడుతూ.. శ్రీకృష్ణుడిని, భగవద్గీతను విశ్వసించడం వల్ల జ్ఞానం, మోక్షం లభిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో టి.వి.కృష్ణారావు, ఆర్.రామకృష్ణ, ఎ.అన్నపూర్ణ, ఎ.సాత్విక పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం



తెనాలిటౌన్: స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని మహాత్మాగాంధీ సేవా శాంతి ఆశ్రమంలో ఆదివారం మదర్స్ డే సందర్భంగా వృద్ధులకు అన్నదానం ఏర్పాటు చేశారు. వెంకటేశ్వర యోగ సేవా కేంద్రం నిర్వాహకుడు ముద్దాబత్తుని రమణయ్య ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా బీజేపీ సీనియర్ నాయకుడు అడపా సంపత్‌రాయుడు పాల్గొని వృద్ధులకు అన్నదానం చేశారు. యోగ సభ్యులు రమణయ్య వారి తల్లి అమికమ్మ జ్ఞాపకార్థం మదర్స్ డే సందర్భంగా సేవా కార్యక్రమం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సావిత్రి, అనూష, జగదీశ్వరి, ఉమామహేశ్వరి, ఆశ్రమ నిర్వాహకులు వజ్రాల రామలింగాచారి, వై.కోటేశ్వరరావు, పలువురు యోగసాధకులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడి సంస్మరణ సభ



నివాళులర్పిస్తున్న రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్యరామి రెడ్డి

దుగ్గిరాల: వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు దాసరి సాంబయ్య సంస్మరణ కార్యక్రమం దుగ్గిరాల మండలం చుక్కపల్లివారిపాలెంలో ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్యరామి రెడ్డి హాజరయ్యారు. సాంబయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నిబద్ధత నిజాయితీ గల సీనియర్ నాయకుల మరణం పార్టీకి, గ్రామానికి తీరనిలోటని అన్నారు. ఐఆర్‌ఎస్ అధికారి మేకతోటి దయాసాగర్ మాట్లాడుతూ.. మండలంలో ఎన్నో అభివృద్ధి పనులు సాంబయ్య కుటుంబ సభ్యుల ద్వారా జరిగాయని గుర్తుచేశారు. ప్రముఖ క్రైస్తవ సంగీత రచయిత, సింగర్ ఎ.ఆర్ స్టీవెన్సన్ క్రైస్తవ గీతాలు వినిపించారు. కార్యక్రమానికి మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావు, మండల పార్టీ అధ్యక్షులు టి.శివ గోపయ్య, మేడికోండూరు జడ్పీటీసీ కందుల సిద్దయ్య, పేరుకలపూడి సర్పంచ్ జి.గంగాధర రావు, ఎంపీడీఓ ఎ.శ్రీనివాసరావు, ఎంపీటీసీలు, గ్రామసర్పంచ్‌లు పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

బహిరంగంగా మద్యం తాగితే కఠిన చర్యలు

మద్యం సేవిస్తున్న ఆరుగురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

మంగళగిరి: బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే కఠిన చర్యలు తప్పవని మంగళగిరి రూరల్ ఎస్‌ఐ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. ఆదివారం మండల పరిధిలోని చినకాకాని రాజ్‌కమల్ రోడ్డు, హాయ్ ల్యాండ్ రోడ్డులలో మద్యం సేవిస్తున్న ఆరుగురు మద్యం బాబులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, అసాంఘిక కార్యక్రమాలు, జూదం వంటి వాటిపై నిరంతరం నిఘా కొనసాగుతుందన్నారు. వీటిని ఉపేక్షించిన వారిపై కేసులు నమోదు చేసి చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

రౌడీషీటర్లుకు కౌన్సెలింగ్..

మంగళగిరి రూరల్ పరిధిలోని రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లుకు ఆదివారం రూరల్ స్టేషన్ ఆవరణలో పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించారు. రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లు ప్రజలను ఇబ్బంది పెట్టాలని చూస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. నేరప్రవృత్తిని వీడి సత్ప్రవర్తనతో మెలగాలన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు

మంగళగిరి టౌన్: రెండు దశాబ్దాల తరువాత పూర్వ విద్యార్థులు ఒకే వేదికపై కలుసుకుని ఆనంద పలకరింపులతో పులకరించిపోయారు. మంగళగిరి నగర పరిధిలోని చింతక్రింది కనకయ్య బాలికల పాఠశాల 2002–03 పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నగరంలోని గౌతమబుద్ధ రోడ్‌లోని ఓ రెస్టారెంట్‌లో ఏర్పాటుచేశారు. తమకు అప్పట్లో విద్యనేర్పిన గురువులందరినీ ఆహ్వానించారు. నాటి గురువులు స్వర్ణలత, విద్యాదారి, రమాదేవి, దేవమణమ్మ, నాగమణి, విజయలక్ష్మి, జయభారతి, సావిత్రి, సరళాదేవి, గీతాకిరణ్, పద్మ, బాల త్రిపుర సుందరి, తనూజలను పూర్వ విద్యార్థులంతా కలిసి శాలువాలతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఉన్నత స్థానాలకు ఎదిగిన శిష్యురాళ్లను చూసి ఆ ఉపాధ్యాయులు ఎంతో గర్వంగా ఆనంద పడ్డారు. భవిష్యత్తులో మరింత ఎత్తుకు ఎదిగి సమాజ అభివృద్ధిలో పాలు పంచుకోవాలని ఆశీర్వదించారు. 23 ఏళ్ల తరువాత తమను గుర్తుంచుకుని సత్కరించడం ఎంతో సంతోషాన్ని కలిగిస్తోందని పలువురు గురువులు అన్నారు. అనంతరం విందు, వినోదాలు, చిన్ననాటి జ్ఞాపకాల ముచ్చట్లతో పూర్వ విద్యార్థులు ఆనందంగా గడిపారు.